
సాక్షి
బాపట్ల
బుధవారం । 5 । జూలై । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటి మట్టం మంగళవారం 519.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,000, గరిష్ట ధర రూ.1,800, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రష్మీకి కాంస్యం



విజయవాడ స్పోర్ట్స్: ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన 62వ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో విజయవాడకు చెందిన కె.రష్మీ జావెలిన్‌త్రో విభాగంలో కాంస్య పతకం సాధించింది.

న్యూస్‌రీల్

బాలవాటిక-3లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: కేంద్ర నూతన విద్యావిధానంలో భాగంగా తెనాలి కేంద్రీయ విద్యాలయంలో కొత్తగా ప్రారంభించనున్న బాలవాటిక-3లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటికలో ప్రవేశానికి ఐదేళ్లు నిండి ఆరేళ్లలోపు చిన్నారులు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుందని, జూలై 6, 2023 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. దరఖాస్తుకు ఆఖరు తేదీ జూలై 18, 2023 అని, ఎంపికైన బాలల జాబితాను జూలై 28న ప్రకటిస్తామని వివరించారు. తరగతులు జూలై 29 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపిక విధానం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ 9441486931, 86397 59034ను సంప్రదించాలని సూచించారు.

యార్డుకు 47,933 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 47,933 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,141 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.12,000 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,916 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ సబ్ ఇంజినీర్



బాణావత్ రామాంజనేయులు నాయక్

వినుకొండ(నూజెండ్ల) : లంచం తీసుకుంటూ విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామానికి చెందిన ఎ.కోటేశ్వరరావు తన పొలానికి నీరు పెట్టేందుకు విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ బాణావత్ రామాంజనేయులు నాయక్ రూ.80 వేలు డిమాండ్ చేశారు. ముందుగా రూ.60 వేలు, కనెక్షన్ ఇచ్చిన తరువాత మిగతా రూ.20 వేలు ఇవ్వాలని అడిగారు. దీంతో రైతు కోటేశ్వరరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం వినుకొండ మండలంలోని చీకటీగలపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతు నుంచి సబ్ ఇంజినీర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్ర ముత్తే తెలిపారు. తనిఖీలో ఏసీబీ డీఎస్పీలు ప్రతాప్, సత్యానందం, ఇన్‌స్పెక్టర్లు రవిబాబు, నాగరాజు, లక్ష్మారెడ్డి, మన్మథరావు, అంజిబాబు, సురేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కేసులో టీడీపీ నాయకులు అరెస్ట్

వెల్దుర్తి: ఇటీవల జరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో టీడీపీ నాయకులు ముఢావత్ రెడ్యానాయక్, కూరపాటి కొండలతోపాటు మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.శ్రీహరి మంగళవారం తెలిపారు. లోయపల్లి గ్రామానికి చెందిన పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఎనిమిది మంది చోరీకి చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మాచర్ల మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

పంటల బీమాపై పచ్చరాతలు



పనిగట్టుకుని దుష్ప్రచారం
- నిబంధనల మేరకే బీమా వర్తింపు
- కర్షకుల పక్షపాతిగా వైఎస్ జగన్ ప్రభుత్వం
- రైతుభరోసా కేంద్రాల్లో రైతుల జాబితాల ప్రదర్శన
- అభ్యంతరాలు ఉంటే తెలపాలని ప్రకటన
- అన్నదాతల్లో ప్రభుత్వంపై అపార నమ్మకం

ఫ్యాక్ట్ చెక్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పంటల బీమాకు సంబంధించి రైతులకు పరిహారం అందించేందుకు కర్షక పక్షపాతిగా పేరొందిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. జూలైనెల 8న వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవాన్ని రైతు దినోత్సవ సభలో కర్షకుల ఖాతాల్లో బటన్‌నొక్కి పరిహారం జమచేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. పంటలు నష్టపోయిన జిల్లా రైతులు ఆ ఘడియ కోసం ఆనందంతో ఎదురు చూస్తున్నారు. ఇంతలోనే పచ్చపత్రికల కళ్లు కుట్టాయి. పంటలబీమాలో జిల్లా రైతులకు అన్యాయం జరిగిందంటూ తప్పుడు రాతలతో విషపు బీజాలు నాటే యత్నానికి దిగాయి. కొన్ని పంటలకే బీమా వచ్చిందని, మరికొన్ని పంటలకు ఎందుకివ్వలేదంటూ? పనిగట్టుకొని ప్రభుత్వంపై బురదజల్లాయి. ఈ నేపథ్యంలో పచ్చపత్రికల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారులూ తప్పుడు కథనాలను ఖండిస్తున్నారు.

అందరికీ న్యాయం

జిల్లాలో 2022 ఖరీఫ్ సీజన్లో వరి, కంది, మినుము పంటలకు దిగుబడి ఆధారిత పంటల బీమా వర్తిస్తుంది. వీటితోపాటు వర్షాధారం కింద సాగయ్యే పత్తి, ఎండు మిరప పంటలు వాతావరణ ఆధారిత పంటలబీమా పథకం పరిధిలోకి వస్తాయి. ఈ పంటలను సాగుచేసిన రైతులు ఆయాగ్రామాల పరిధిలో రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామవ్యవసాయ, ఉద్యాన సహాయకులచే ఈ-క్రాప్ యాప్ ద్వారా పంట నమోదుతోపాటు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసుకున్న రైతులకు వైఎస్సార్ ఉచిత పంటలబీమా వర్తిస్తుంది.

పారదర్శకంగా పరిహారం నిర్ధారణ

దిగుబడి ఆధారిత పంటలకు సంబంధించి పంటలబీమా పథకంలో నిబంధనలు అనుసరించి జిల్లా యూనిట్, మండల యూనిట్, గ్రామం యూనిట్‌గా పరిగణించి ఆయా యూనిట్ పరిధిలో చేపట్టిన పంట కోత ప్రయోగాల ద్వారా వచ్చిన ఫలితాల ఆధారంగా దిగుబడి ఆధారిత బీమాను నిర్ణయిస్తారు. ఈ సంవత్సరం బాపట్ల జిల్లాలో కంది, మినుము పంటలకు జిల్లా యూనిట్‌గా, వరి పంటకు గ్రామం యూనిట్‌గా తీసుకున్నారు. వాతావరణ ఆధారిత పథకంలో వర్షాధార పంటలైన పత్తి, ఎండుమిరప పంటలు సాగుచేసి ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు మండలం యూనిట్‌గా తీసుకొని ఆయా మండలాల్లో నెలకొన్న వాతావరణ పరిస్థితుల ఆధారంగా పంటలబీమా వర్తింపజేశారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించారు.

ఆర్‌బీకేల్లో అర్హుల జాబితాల ప్రదర్శన

పంటలబీమా పరిహారం వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో జూన్ 28 నుంచి జూలై 3 వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించారు. జూలై 4వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో రైతుల నుంచి అభ్యంతరాలు కోరారు. వాటిని పరిశీలిస్తామని క్షేత్రస్థాయిలో రైతులకు చెప్పారు. అయితే రైతుల నుంచి అభ్యంతరాలు రాలేదు.

ఈ-క్రాప్‌లో నమోదై.. ఈ-కేవైసీ పూర్తిచేసిన అందరికీ న్యాయం

జిల్లాకు దిగుబడి ఆధారిత బీమా పథకంలో కందిపంటకు రూ.1.37 కోట్లు, వరి పంటకు రూ.2.63 కోట్లు పరిహారం ఇవ్వనున్నారు. వాతావరణ ఆధారిత బీమా ద్వారా పత్తి పంటకు రూ.1.05 కోట్లు పరిహారం వర్తించింది. దిగుబడి ఆధారిత బీమా ద్వారా కంది పంటను జిల్లా యూనిట్‌గా తీసుకోవడం వలన పర్చూరు మండలంలో ముగ్గురు రైతులు, కారంచేడు మండలంలో ఒకరు, యద్దనపూడి మండలంలో 12 మంది రైతులు మాత్రమే ఈ-క్రాప్ నమోదు చేసుకుని ఈ-కేవైసీ పూర్తి చేశారు. దీంతో వీరికి బీమా వర్తించింది. ప్రభుత్వం బీమా పరిహారం పంపిణీ విషయంలో పారదర్శకంగా వ్యవహరించినా పచ్చపత్రికలు పనిగట్టుకొని బురదజల్లే కార్యక్రమానికి దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనల మేరకే..

పంటల బీమా వ్యవహారంలో నిబంధనల మేరకే వ్యవహరించాం. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశాల మేరకు జూలై 4వ తేదీ సాయంత్రం వరకూ అభ్యంతరాలను స్వీకరించాం. జూన్ 28 నుంచి జూలై 4 వరకూ రైతుభరోసా కేంద్రాల్లో జాబితాలు ప్రదర్శించాం. అయినా రైతులు ఎటువంటి ఫిర్యాదులు చేయలేదు. – అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయ అధికారి, బాపట్ల



మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వెంకటేష్

మంచి మనిషి రోశయ్య

- కొనియాడిన ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- చీరాలలో ఎంజీసీ క్లాత్ మార్కెట్ ఎదుట రోశయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ

చీరాల రూరల్: రాజకీయాల్లో మకుటంలేని మహారాజుగా కొణిజేటి రోశయ్య వర్ధిల్లారని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి కొనియాడారు. బాపట్ల జిల్లా చీరాల ఎంజీసీ క్లాత్ మార్కెట్ వద్ద రోశయ్య కాంస్య విగ్రహాన్ని మంగళవారం కరణం బలరామ కృష్ణమూర్తి, ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, రోశయ్య తనయులు శివ, శ్రీమన్నారాయణ మూర్తి చేతులు మీదుగా ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కొణిజేటి రోశయ్య చేసే రాజకీయాల ముందు ఎంతటివారైనా దిగదుడుపే నన్నారు. ఆయన ఛలోక్తులతో అసెంబ్లీని కూడా ఎంతో మంచి వాతావరణంలో నడిపించేవారని గుర్తు చేశారు. వయస్సులో ఆయనకంటే తాను చిన్నవాడినైనప్పటికీ మంచి సలహాలు ఇస్తుండేవారని, మంచి మనిషి అని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనదేనన్నారు. రోశయ్య కుటుంబంతో ప్రత్యేకమైన అనుబంధం ఉండేదన్నారు. ఆయన స్నేహానికి ప్రాణమిస్తారని చెప్పారు. ముఖ్యంగా వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే రోశయ్యకు ఎనలేని ప్రేమని, ఆయన చెప్పిన మాట జవదాటేవారు కాదని గుర్తు చేశారు. వైఎస్ మరణానంతరం జరిగిన పరిణామాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా సేవలందించారని చెప్పారు. ఆయన అనేక హోదాల్లో సేవలందించినా నిరాడంబరంగా ఉండేవారని చెప్పారు. ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో నిలిచిపోతాయన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ మాట్లాడుతూ రోశయ్య పేరును తాము ఉచ్చరించేందుకు అర్హులం కాదని.. పెద్దాయన అని మాత్రమే పిలుస్తామని చెప్పారు. పెద్దాయన చీరాల ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఆయన అడుగుజాడల్లో ఆయన స్ఫూర్తితో అందరం ముందుకు నడుస్తామని చెప్పారు. ఆయన తనయులు శివ, శ్రీమన్నారాయణ మూర్తి మాట్లాడుతూ చీరాల ప్రజలు తన తండ్రిపై ఇంతగా ప్రేమాభిమానాలు చూపిస్తుంటే గర్వంగా ఉందన్నారు. తమ కుటుంబ సభ్యులకంటే చీరాల ప్రజలపైనే తన తండ్రికి ఎనలేని ప్రేమని వారు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, రామసుబ్బులు, కౌన్సిలర్లు మామిడాల రాములు, పొత్తూరి సుబ్బయ్య, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, మల్లెల లలితా రాజశేఖర్, స్వాతి, ఆర్యవైశ్య ప్రముఖులు తేల్రపోలు వెంకటేశ్వరరావు, తులాబందుల వెంకట సురేష్, చిన్ని లీలాధరరావు, ఎస్.వేణుగోపాల్, ఎస్.రాఘవయ్య, చేబ్రోలు బాలాజి, వలివేటి మురళీ కృష్ణ, అచ్యుత శ్రీనివాసరావు, పెనుగొండ కిషోర్‌బాబు, గుర్రం రాఘవరావు, ఊటుకూరి ఏకాంబరేశ్వరరావు, చారుగుళ్ల ప్రసాద్, పాతపాటి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 200 పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సమీక్ష చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులు 200 భర్తీ చేసేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మంగళవారం నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, నాట్కో సెంటర్ కన్వీనర్ యడ్లపాటి అశోక్‌కుమార్, క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్, ఇతర వైద్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈనెల 1న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు జీజీహెచ్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది ఖాళీలపై ప్రతిపాదనలు పంపాలని ఆస్పత్రి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో మంగళవారం డాక్టర్ కిరణ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో సుమారు ఏడేళ్లుగా నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులు 200 ఖాళీగా ఉండడానికి గల కారణాలను ఆయన తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేయాలని ఆదేశించినా ఈ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీల వివరాలను ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు నుంచి సేకరించి డీఎంఈ కార్యాలయానికి తక్షణమే ప్రతిపాదించాలని ఆదేశించారు. సమావేశంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్, క్యాన్సర్‌వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ జహ్నవి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైరుతి రాగం

గుంటూరు జిల్లావ్యాప్తంగా వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు): నైరుతి రుతుపవనాల ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 160.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 1.2 మి.మీ వాన పడింది. సగటున 42 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా తెనాలి మండలంలో 118.6 మి.మీ., చేబ్రోలు 86, తాడేపల్లి 45.6, కొల్లిపర 42.6, పెదకాకాని 42, ఫిరంగిపురం 39.4, గుంటూరు తూర్పు 36.4, పొన్నూరు 31.6, తుళ్ళూరు 27.4, కాకుమాను 26.2, ప్రత్తిపాడు 23.4, మంగళగిరి 23, పెదనందిపాడు 17.8, గుంటూరు పశ్చిమ 16.6, వట్టిచెరుకూరు 14.4 మిల్లీమీటర్ల వాన పడింది.

అల్లూరి స్ఫూర్తి ఆదర్శనీయం

కలెక్టర్ రంజిత్‌బాషా



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవం జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కలెక్టర్ రంజిత్ బాషా, డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారిణి జె.రాజదిబోరా, కలెక్టరేట్ ఏఓ కె.గోపికృష్ణ పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి దేశభక్తిని కీర్తించారు. అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని దేశ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీఆర్ఓ లక్ష్మీశివజ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారిని జె.రాజదిబోరా చెప్పారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జీఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అందరివాడు రంగా



విగ్రహాల ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే. చిత్రంలో వంగవీటి రాధా

- ఎమ్మెల్యే ఆర్కే, వంగవీటి రాధా
- ప్రాతూరులో వంగవీటి మోహనరంగా, ఆయన సోదరుడు వంగవీటి రాధా విగ్రహాల ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రేవల్లె కనకదుర్గవారధి కరకట్ట వెంబడి ప్రాతూరు వద్ద అమ్మిశెట్టి వారి ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా, ఆయన సోదరుడు వంగవీటి రాధా విగ్రహాలను ఏర్పాటు చేశారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా మంగళవారం విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వంగవీటి మోహనరంగా తనయుడు వంగవీటి రాధా, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, పోతిన మహేష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమంలో పాల్గొనడం మన అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం వంగవీటి రాధా మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్ని అనుమతులతో పేదల నాయకులు వంగవీటి మోహనరంగా, వంగవీటి రాధా విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. వంగవీటి మోహన రంగా అన్ని వర్గాల్లో స్ఫూర్తి నింపారని, ఆయన మరణించి మూడు దశాబ్దాలు దాటినా ఆయన జయంతి కార్యక్రమాలను ప్రజలు భారీ ఎత్తున నిర్వహించడమే దీనికి నిదర్శనమని కొనియాడారు. ఆయనకు రకరకాలుగా కుల రంగు పూస్తున్నారని, ఆయనకు కష్టంలో ఉన్నవాడిని ఆదుకోవడమే తెలుసని, ఆయన అందరివాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మిశెట్టి రవి, సూరిశెట్టి వెంకటేశ్వరరావు, రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపిటిసి రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా 'బుస'క

- ఇసుక పేరుతో అమ్మకాలు
- వ్యాపారుల మాయమాటలు
- పోతార్లంక మినహా ఇసుక లీజులు ఇవ్వని మైనింగ్ శాఖ
- నిర్మాణాలకు బుసక పనికి రాదంటున్న ఇంజినీరింగ్ అధికారులు
- ఒక్కో టిప్పర్ బుసక రూ.15 వేలకు అమ్ముతున్న వైనం



వెదుళ్ళపల్లి ప్రాంతంలో బుసక తవ్వకాలు జరిపిన ప్రాంతం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇసుక పేరు చెప్పి వ్యాపారులు బుసక అమ్ముతూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. దువ్వ మట్టితో కలిసి ఇసుకలాగా కనిపించే బుసకను పునాదులు ఇతరత్రా వాటిల్లో ఫిల్లింగ్‌కు మాత్రమే ఉపయోగించాలి. అయితే జిల్లాలోని వ్యాపారులు ఇసుక పేరుతో బుసక అమ్ముతూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఉప్పుశాతం అధికంగా ఉండే బుసకను వాడడం వల్ల నిర్మాణాలు ఎక్కువ కాలం ఉండే అవకాశం లేదు. త్వరగానే దెబ్బతినే ప్రమాదముందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

అనుమతి లేకుండానే అక్రమ రవాణా

జిల్లాలో మైనింగ్ అధికారులు కొల్లూరు మండలం పోతార్లంకలో మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చారు. బాపట్ల పరిధిలోని వెదుళ్ళపల్లి, కర్లపాలెం, పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం ప్రాంతాల్లో బుసక, సిలికా తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. వెదుళ్ళపల్లిలో కేవలం ఎకరా పరిధిలో బుసక తవ్వకాలకు అనుమతి ఇవ్వగా కర్లపాలెంలో రెండు ప్రాంతాల్లో తవ్వకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వీటితోపాటు ఎటువంటి అనుమతులూ లేకుండానే స్టూవర్టుపురం, చినగంజాం, నగరం, నిజాంపట్నం,పెనుమూడితోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వ్యాపారులు అక్రమంగా ఇసుక మాటున బుసకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రూ.కోట్లు గడిస్తున్నారు.

ఇసుకలో బుసక కలిపి..

బుసక నిర్మాణాలకు పనికిరాదని మైనింగ్ అధికారులతోపాటు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. బుసకలో మట్టిశాతం అధికంగా ఉండటమేకాక వెదుళ్ళపల్లి, కర్లపాలెం, స్టూవర్టుపురంతోపాటు పలు ప్రాంతాల్లో ఉప్పుశాతం ఉండటం వల్ల నిర్మాణాలు త్వరగా దెబ్బతింటాయని పేర్కొంటున్నారు. ఇసుకకు బాగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో కొందరు వ్యాపారులు బుసకలో కొంత ఇసుక కలిపి విక్రయిస్తున్నారు. మరికొందరు అంతా బుసకనే విక్రయిస్తుండటం గమనార్హం. తాము బుసకపేరుతోనే అనుమతులిచ్చామని, బుసక నిర్మాణాలకు పనికిరాదన్న విషయాన్ని గుర్తించాలని మైనింగ్ అధికారి ఆర్.రాజేష్ తెలిపారు.

రూ.కోట్లలో వ్యాపారం

ఇసుక పేరుతో బుసక వ్యాపారం రూ.కోట్లలో జరుగుతున్నట్టు సమాచారం. వాస్తవానికి వెదుళ్ళపల్లిలో ఒక ఎకరం పరిధిలోనే బుసక తవ్వకానికి అనుమతి ఇచ్చారు. ఇక్కడి నుంచి కేవలం 4.9 మీటర్లమేర (20 వేల క్యూబిక్ మీటర్లు) బుసకను తరలించేందుకే అనుమతి ఉంది. దీనిని రహదారి పనుల్లో ఫిల్లింగ్‌కు మాత్రమే వాడాలి. కానీ చాలారెట్లు అధికంగా ఇక్కడ బుసక తవ్వకాలు జరిగినట్లు తెలుస్తోంది. కర్లపాలెం పరిధిలోనూ రెండు ప్రాంతాల్లో మాత్రమే బుసక తవ్వకాలకు అనుమతి ఉంది. ఇక్కడినుంచి రైల్వేపనులకు మాత్రమే తరలించాలి. అయితే ఇక్కడి నుంచి భవన నిర్మాణాలకూ తరలిపోతున్నట్టు తెలుస్తోంది. రియల్‌ఎస్టేట్ వెంచర్లకు, కొందరు అధికారులు సొంత నిర్మాణాలకూ బుసకను తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుక, బుసకను స్థానికంగానే రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. ఇతరప్రాంతాలకైతే ధర ఇంకా ఎక్కువే.

అవగాహన లేకే

అవగాహన లేక ప్రజలు బుసకను ఇసుకగా భావించి ఇంటి నిర్మాణాలకు వాడుతున్నారు. కొందరు గ్రహించి అదేమిటని అడిగితే ప్రభుత్వ నిర్మాణాలకూ బుసక వాడుతున్నామని వ్యాపారులు నమ్మబలుకుతున్నారు.

నిబంధనలకు నీళ్లు

బాపట్ల జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లా పరిసర ప్రాంతాల్లోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. నిర్మాణాలు జోరందుకున్నాయి. ఫలితంగా ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ఇసుక పేరుతో బుసకను తరలిస్తున్నారు. దీనికీ గిరాకీ పెరగడంతో వ్యాపారులు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. వెదుళ్ళపల్లి, కర్లపాలెం వద్ద కేటాయించిన అనుమతులకు మించి ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరిపారు. మరోవైపు మైనింగ్ నిబంధనలు ఉల్లంఘించి పరిమితికి మించి తవ్వకాలు జరిపినట్లు మైనింగ్ అధికారులు గుర్తించారు. అనుమతులు లేకపోయినా చినగంజాం, స్టూవర్టుపురం, నగరం, నిజాంపట్నం ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక, బుసకను తవ్వి రవాణా చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

అద్దంకిరూరల్: న్యాయం జరగలేదని పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన తిరుపతి వెంకాయమ్మ గ్రామానికి చెందిన ఆర్‌బీకే సెంటర్‌కు వెళ్లే దారిలో 4.5 సెంట్ల భూమిని ఆక్రమించి గడ్డివాములు వేసుకుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయాలని కోరినా చేయకపోవటంతో ఆక్రమణను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. అద్దంకి సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో మంగళవారం ఆక్రమణ స్థలంలో ఉన్న వరిగడ్డివామి తొలగింపు చర్యలు చేపట్టటంతో తనకు న్యాయం జరగలేదని భావించి వెంకాయమ్మ పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి ఆత్మహత్య పాల్పడింది. స్థానికుల సాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతోంది.

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తాం



పల్నాడు కలెక్టర్‌ను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

నరసరావుపేట:జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి తగిన సహకారం అందజేస్తానని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ వెల్లడించారు. పిడుగురాళ్ల, వినుకొండలో గ్రంథాలయాల ఏర్పాటుకు తహసీల్దార్లకు ఫోన్‌చేసి స్థలసేకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం స్థలసేకరణ, సెస్ బకాయిలు, పుస్తక పంపిణీ కేంద్రాల విస్తరణపై చర్చించారు.

15లోగా పెన్షన్‌దారులు ఈకేవైసీ చేయించాలి

నరసరావుపేటఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు ఈనెల 15వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ట్రెజరీ కార్యాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు 3,238 మంది ఉండగా 428మంది ఈకేవైసీ చేయించలేదని తెలిపారు. వారు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

రాజకీయ చాణక్యుడు రోశయ్య

- మంత్రి మేరుగ నాగార్జున
- వేమూరులో రోశయ్య విగ్రహావిష్కరణ



రోశయ్య విగ్రహాన్ని ప్రారంభించిన మంత్రి మేరుగ నాగార్జున, కేవీపీ రామచంద్రరావు

వేమూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చాణిక్యుడు కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా వేమూరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ, కొణిజేటి రోశయ్య విగ్రహాలను మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామ చంద్రరావు ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వేమూరు గ్రామంలో చదువుకున్న మహనీయుడు రోశయ్యన్నారు. ఆయన మృతి చెందిన తర్వాత వేమూరులో ఆయన విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకి దక్కిందన్నారు. విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారని చెప్పారు. రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో రోశయ్యకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, కొణిజేటి శివ సుబ్బారావు, ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, మద్దాళి గిరిధర్, బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, సాధు ప్రతాప్‌కుమార్, గుబ్బా చంద్రశేఖర్, రేపాల శ్రీనివాస్, కోలేటి దామోదర్, కొండ్లె మల్లికార్జునరావు, నంబూరు వెంకట కృష్ణమూర్తి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చందు సాంబశివుడు, మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నంబూరు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పోతురాజు

మేడికొండూరు: ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దోపిడీ దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు తుళ్లూరు డీఎస్పీ పోతురాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన తాడిగిరి శివరామయ్య గత నెల 26న విజయవాడ నుంచి కొర్రపాడుకు రాత్రి 9 గంటల సమయంలో వస్తున్నాడు. ఇదే సమయంలో గుంటూరు నుంచి కొర్రపాడు వచ్చే సమయంలో హౌసింగ్‌బోర్డు వద్ద ఆటో కోసం వేచి ఉన్న శివరామయ్యను కొందరు వ్యక్తులు కారులో అటువైపు వెళుతున్నామని నమ్మబలికారు. శివరామయ్య వారి కారులో ఎక్కి కొర్రపాడు బయల్దేరాడు. ఈక్రమంలో పేరేచర్ల శివారు చేరే సమయానికి కారులో ఉన్న ఆరుగురు శివరామయ్యపై దాడిచేసి అతడి వద్ద ఉన్న రూ.27 వేలు, సెల్‌ఫోన్ లాక్కొని శివరామయ్యను అక్కడ వదిలి వెళ్లిపోయారు. బాధితుడు మేడికొండూరు పోలీసులకు ఘటన విషయంపై ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు రంగంలో దిగిన మేడికొండూరు సీఐ వాసు ఇటీవల నూతనంగా పేరేచర్ల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో దుండగులు వాడిన కారును గుర్తించినట్లు వెల్లడించారు. గుంటూరు కృష్ణబాబు కాలనీకి చెందిన మల్లెల శ్రీకాంత్, మల్లెల దుర్గారావు, ఉప్పుతోళ్ల నాగరాజు, ఏటీ అగ్రహారానికి చెందిన గంట శివనాగరాజు, గుంటూరు రూరల్ మండలం నల్లపాడు గ్రామానికి చెందిన చిమ్మిశెట్టి చిననాగరాజు, తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన చిన్న వీరు ఆరుగురు ఒక ముఠాలా ఏర్పడి తోటి ప్రయాణికులుగా వ్యవహరిస్తూ దోపిడీలకు పాల్పడినట్లు చెప్పారు. వీరు గతంలో కూడా పలు చోరీలకు పాల్పడినట్లు నిర్ధారించినట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అత్యంత చాకచక్యంగా పట్టుకున్న సీఐ వాసు, ఎస్ఐ మధుపవన్, సిబ్బంది సైదా, సిద్దయ్య, నజీర్, డేవిడ్, రామారావు, గోపాలకృష్ణ, మాణిక్యరావులను డీఎస్పీ అభినందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రివార్డును అందజేయడం జరిగిందని తెలిపారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

- గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- అక్టోబర్ 2 నుంచి 50 రోజులపాటు ప్రతి నియోజకవర్గంలో..



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: యువతలో క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి 50 రోజులపాటు ప్రతి నియోజకవర్గంలోనూ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడుతూ 17 ఏళ్ల వయస్సు పైన ఉన్న వారు ఎవరైనా ఇందులో పాల్గొనవచ్చన్నారు. గ్రామ, వార్డు, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నిర్వహించిన ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలతోపాటు సాంప్రదాయ క్రీడలైన యోగ, టెన్నికాయిట్, 3-కె రన్‌ను నిర్వహిస్తామని చెప్పారు. గ్రామస్థాయి నుంచే ఆటలకు కావల్సిన క్రీడా సామగ్రిని కూడా అందిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జెడ్పీ సీఈఓ పల్లవి, చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, డీఈఓ శైలజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదలకు రంగా సేవలు ఎనలేనివి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

నిజాంపట్నం (రేపల్లె): పేదల పక్షపాతి వంగవీటి మోహనరంగా భౌతికంగా దూరమైనా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా నిజాంపట్నంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల ఇళ్ల పట్టాల కోసం దీక్షలు చేసి పేదలపక్షపాతిగా పేరొందారన్నారు. రంగాకు ప్రజల్లో ఉన్న అభిమాన్ని చూసి ఓర్వలేక నాడు టీడీపీ నాయకులు తమ కుట్రలతో హతమార్చారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రజాస్వామ్య బద్ధంగా చేస్తున్న నిరాహార దీక్షను ఆసరాగా చేసుకుని ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగాను అతికిరాతకంగా టీడీపీ నాయకుల కనుసన్నల్లో హత్య చేసిన సంఘటనను ప్రజలు మరిముఖ్యంగా కాపు వర్గం మరువలేదన్నారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అల్లంశెట్టి శ్రీనివాసరావు, చిమటా బాలాజీ, ఫల్గుణ్ తదితరులు పాల్గొన్నారు.

పశుపక్షాదుల నుంచి వ్యాధులు సంక్రమించకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: పశుపక్షాదుల నుంచి ప్రజలకు వ్యాధులు సంక్రమించకుండా అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. జునోసిస్ కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రజారోగ్యం పరిరక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈనెల ఆరో తేదీన జునోసిస్ డేను పురస్కరించుకొని పెంపుడు జంతువులకు టీకాలు వేయాలన్నారు. జంతువుల నుంచి ప్రజలకు పలు వ్యాధులు సంక్రమిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యంగా పెంపుడు కుక్కల నుంచి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఇందుకోసం అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పశువైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 11 వేల రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు పశువైద్యశాలల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. పట్టణ ప్రాంతాలలో వీధి కుక్కల సంతతిని నియంత్రించడానికి కుటుంబ నియంత్రణకు శస్త్ర చికిత్సలు నిర్వహించాలన్నారు. జూనోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామని సంబంధిత శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. జంతువులు, పక్షుల వలన వచ్చు జబ్బులను నివారించాలన్నారు. పక్షుల నుంచి బర్డ్ ఫ్లూ వ్యాధి సంక్రమించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జబ్బుల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక మేరకు జిల్లాస్థాయిలో వార్షిక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డి.ఐ.ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి అగ్ర తాంబూలం

- రాష్ట్రంలో 26 ప్రకృతి వ్యవసాయ ఆదర్శ మండలాలు
- రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు



శిక్షణలో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు

గుంటూరు రూరల్: రాష్ట్రవ్యాప్తంగా 26 మండలాలను ప్రకృతి వ్యవసాయాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసి నూరు శాతం ప్రకృతి వ్యవసాయ ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దుతున్నామని రైతు సాధికార సంస్థ సీఈవో బి.రామారావు తెలిపారు. మంగళవారం గుంటూరులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో ఒక మండలం చొప్పున ఆదర్శ మండలాలను గుర్తించామని.. ఆయా మండలాల్లో రసాయన వ్యవసాయం చేసే రైతులందరినీ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా సమాయత్తం చేసేందుకు ప్రత్యేక ప్రాజెక్ట్ అమలు చేస్తున్నామని చెప్పారు. ఆదర్శ మండలాలను తీర్చిదిద్దడంలో పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ (సీసీ)లు కీలకపాత్ర నిర్వహిస్తారన్నారు. రైతు సాధికార సిబ్బంది, సెర్ప్ సిబ్బంది సమన్వయంతో ఈ దిశగా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. రసాయన వ్యవసాయం వల్ల నేల నిర్జీవమైపోతోందని, ప్రకృతి వ్యవసాయంతో నేలను బలోపేతం చేసి సారవంతం చేయాలన్నారు. భూమి బాగుంటేనే మనిషి బాగుంటాడని, మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి రసాయన రహిత వ్యవసాయమే ఏకైక మార్గమన్నారు. ఆదర్శ మండలాల్లో మార్కెటింగ్, ఆరోగ్యం, లింగ సమానత్వం తదితర అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయడం జరుగుతుందని, రైతుకు పూర్వ వైభవం తీసుకు రావాలని ఆయన కోరారు. అనంతపురం జిల్లాలో రైతులు ఏటీఎం (ఎనీ టైమ్ మనీ) మోడల్ వేస్తున్నారని, కేవలం 20 సెంట్ల విస్తీర్ణంలో అనేక రకాల పంటలు పండిస్తూ రైతులకు నిత్యం పంట చేతికి వచ్చేలా ఆ మోడల్ బాగా విస్తరిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య లేదని, అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ముందుకు వస్తున్నాయన్నారు. రసాయన రహిత ఉత్పత్తుల వల్ల సమగ్ర, సమతుల ఆహారం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ థీమాటిక్ లీడ్‌లు చంద్రశేఖర్, రాము, అరుణ, సురేష్, వెంకటరావు, యంగ్ ప్రొఫెషనల్ నితీష్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ఒంగోలుగుల్లాపల్లిగ్రోత్‌సెంటర్‌లోNH5కి100మీ దగ్గరలో 20వేల మంది ఎంప్లాయిస్‌తో అభివృద్ధి గల అన్నివసతులతో ఇప్పుడు ఇల్లు కట్టుకొనుటకు ప్లాట్స్ కలవు. 96188 63613, 76619 42666.

PLOT FOR SALE

■5 సెంట్లు కేవలం 1,50,000లు మాత్రమే, మహాగణి మొక్కలతో, వినుకొండ దగ్గరలో. ఫోన్ : 6304823691

TOLET COMMERCIAL

■ Tolet for Shops/ Banks/ Offices/ Ground Floor. East Facing, North East (with Good Interiors @ Prime Area) 13/2 Arundalpet, Guntur. 84640 10865

SERVICES

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■బంగారము బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 81818 97978

DOCUMENT MISSING

■గుంటూరు జిల్లా పెదకాకాని (మం) (గ్రా) D.No.4-289 నివాసి బొర్రా వెంకటేశ్వర్లు కుమారుడు బొర్రా కిరణ్‌కుమార్ ఆధార్ నెం. 472828970553 అను నేను నా పేరిట గుంటూరు సిటీ JKC కాలేజీ రోడ్ ఏరియా చౌదరి D.No. 295/1, 2 నందలి పల్లవి హైట్స్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం. 102. నా పేరిట 10-1-2008న కోయ హరీష్ తరపున GPAఏజెంట్ కోయ ప్రసాదరావు గారి నుండి విక్రయ దస్తావేజు No. 118/2008 కొరిటిపాడు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడినది. కాగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ కవరులో పెట్టుకొని 28-6-23న నా ఇంటి నుండి కాకాని సెంటర్‌కు జిరాక్స్ కొరకు వెళ్ళుచుండగా దారిలో పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు 9878081900

WANTED

■ పెదకాకానిలోని టుబాకో కంపెనీ నందు పని చేయుటకు హెవీడ్రైవింగ్ లైసెన్స్ గల లారీ డ్రైవర్లు కావలెను. పెదకాకాని పరిసర ప్రాంతాలలో వారికి ప్రాధాన్యత ✆9301830688,7659028880

■GNT సిటీలోని ప్రముఖ బార్ & రెస్టారెంట్ నందు పనిచేయుటకు వెయిటర్లు, క్లీనర్లు వంట మాస్టర్లు P/T కావలెను. భోజన వసతి సౌకర్యం కలదు✆9160320319, 9581277188

■తెనాలి మరియు గుంటూరు Meesho లాజిస్టిక్‌లో పనిచేయుటకు టూవీలర్ కలిగిన డెలివరీ బాయ్స్ కావలెను. జీ: 20000-25000 ✆8978022224, 7386214432

■ Wanted Teachers to teach 6th to 10th Social and Maths subjects. GV thota, Guntur ✆ 9052583553

■పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్ డిస్ట్రిబ్యూషన్ మేనేజర్స్ ఇన్సూరెన్స్ మేనేజర్స్ కావలెను. P/T వర్క్ ఫ్రమ్ హోమ్. ఫిక్స్‌డ్ శాలరీ+ఇన్సెంటివ్స్ మార్కెటింగ్ & రిటైర్డ్ పర్సన్‌కి ప్రాధాన్యత. 9949839400

■గుంటూరు RTC బస్టాండ్ దగ్గరలోని షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్ మరియు ఆఫీస్ నందు పనిచేయుటకు బాయ్స్ కావలెను. మంచిజీతం సంప్ర ✆9160241177

■మా సంస్థ నందు వర్క్ చేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. అర్హత: 10th/ఇంటర్, శాలరీ: 7000 - 10,000, వయస్సు: 18+, సంప్ర: గుంటూరు వాసిలో, 4వలైను, గుంటూరు. 8500486125

■గుంటూరు సిటీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. డ్యూటీ: 8గం॥లు జీతం: 10,000/- 12 గం॥ డ్యూటీ 12,000/- అర్హత 8th to 10th. Ph: 6304407938, 9014799522

■అరండల్‌పేట+కాకానిరోడ్డులో వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్+ఇన్చార్జ్‌షిప్‌కి 70' కావలెను. వోటార్జెట్స్. 9AM-6PM జీ:8000-15000 P/T, F/T ✆ 9985478108, 7780169456

■ప్రముఖ MNC కంపెనీ నందు సత్తెనపల్లి & గుంటూరులలో మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. అ: 7th-డిగ్రీ, జీతం: 12000-25000+ ఇన్సెంటివ్స్ 9959937053

■ Wanted Lady Teachers for 1st to 5th and to teach Telugu upto 6th. Sri Satya Sai Ideal School, Bapuji Road, Sangadigunta, Guntur. Ph: 0863-2222114

■ప్రముఖ ప్రైవేట్ సంస్థ నందు చిలకలూరిపేట, గుంటూరులో జాబ్ చేయుటకు స్త్రీ/పు॥కావలెను. అ:7th-డిగ్రీ, వ:18-30 సం॥, జీ: 12000 - 20000. సంప్ర: 7995685510, 9392256018

■ Wanted Biology Teachers for Reputed School in Guntur. Cont: 7995882317, 7842802317

■ Wanted Analysts, Qual: Any Graduation and preferably 30 WPM Typing Speed. Attractive Salary Package. Interested Candidates can walk in interview from 10.30AM on all weekdays at Apex Solutions Ltd. Contact on 9392757696, 9392757686

■మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. కాల్ చేయండి. 95736 33520, 90596 33520.

■ Wanted Field Collection Executives in Vijayawada. Experience Preferred. Salary + Incentives. For Further Details Contact : 70139 00014, 90322 31756.

■ Vicks & Tide Company నందు పని చేయుటకు రేపల్లె, బాపట్ల, సత్తెనపల్లి, నరసరావుపేటలలో బ్రాంచ్ మేనేజర్, డెలివరి బాయ్స్, మర్చండైజర్స్ కావలెను. బాపట్ల, గురజాలలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 82973 12348, 97051 23436, 95812 34504

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K ఫోన్: 9848571888

■ VISA Consultation overseas Blue & White Colour Jobs. All Profiles Lucrative. Salary High Pay. Interview 3rd to 5th July Hyd & 8 to 11 July Vizag. Ph: 9717618737

■నరసరావుపేట: ప్రముఖ అగ్రికల్చర్ ఇంప్లిమెంట్ సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ & జూనియర్ అకౌంటెంట్ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఫోన్ : 7447374474

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97030 13015
97034 67843
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రారంభమైన ఆంధ్ర సెంట్రల్ జోన్ టెస్ట్ మ్యాచ్‌లు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్-19 బాలుర టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల జట్ల మధ్య మూడు రోజుల టెస్ట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. వర్షం కారణంగా ఆట ఆలస్యంగా ప్రారంభమైంది. బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. జట్టులోని వి.జశ్విన్ 62, హర్ష 30 పరుగులు చేశారు. చైతన్య 24, మొహమ్మద్ 2 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. కృష్ణా బౌలర్లు ఆర్.యశ్వంత్, ఎల్.చిన్నా చెరో 3వికెట్లు సాధించారు. బుధవారం రెండవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావులు పర్యవేక్షించారు.

స్వేచ్ఛలేని జీవితం జీవచ్ఛవం లాంటిది



ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.వి.విజయబాబును సన్మానిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, పక్కన ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

ఏఎన్‌యూ: స్వేచ్ఛలేని జీవితం జీవచ్ఛవం లాంటిదని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పీవీ విజయబాబు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రస్తుత వీసీ రాజశేఖర్ నేతృత్వంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన దేశభక్తుడు అల్లూరి సీతారామరాజుని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, నేటి యువత దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ త్వరలో ఆయన విగ్రహాన్ని ఏఎన్‌యూ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి.ఆర్.కృష్ణంరాజు, ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్ సంగీత నృత్య శాఖ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

పట్నంబజారు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో నగదు దోచుకున్న సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్సై షేక్ ఖాజిబాబు తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు రోడ్డులోని పంచవటి అపార్టుమెంట్‌లో నివాసం ఉండే మొహమ్మద్ తాహ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడంతో వర్క్‌ఫ్రం హోమ్ చేస్తున్నారు. ఈక్రమంలో ఇన్‌స్ట్రాగామ్‌లో ఆన్‌లైన్ లింక్‌ను ఓపెన్ చేసి లింక్ ద్వారా ఇచ్చిన వాట్సాప్ నంబరుకు చాటింగ్ చేస్తూ ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడం మొదలు పెట్టాడు. పలు దఫాలుగా వాట్సాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు సూచించిన విధంగా రూ. 9.17 లక్షలు ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశాడు. ట్రేడింగ్ వల్ల ఎలాంటి లాభాలు రావడం లేదని సదరు గుర్తుతెలియని వ్యక్తులు తిరిగి డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొరకని ఆధారం

పట్నంబజారు: గుంటూరు నగరంలోని కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని గుంటూరు వారితోటలో జరిగిన విజయలక్ష్మి (65) వృద్ధురాలి హత్య కేసును ఇప్పటికీ పోలీసులు కనీస ఆధారాలు సేకరించలేదని తెలుస్తోంది. హత్య జరిగి మూడు రోజులు కావస్తున్నా, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సీసీఎస్, క్రైం, ఇతర విభాగాల అధికారులు, సిబ్బందిని రంగంలో దించి దర్యాప్తు చేపట్టినప్పటికీ నిందితులను పట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. హత్య జరిగిన రోజున ఆప్రాంతంలో పనికి వచ్చిన పలువురు కార్మికులను విచారించిన పోలీసులు హత్యకు పాల్పడింది వారు కాదని స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే అదే ప్రాంతంలోని కొంత మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటి వరకు కనీసం దర్యాప్తు చేస్తున్నప్పటికీ ఎలాంటి ఆధారాలు లభించకపోవడంపై పోలీసులు తలమునకలవుతున్నారు. ప్రత్యేక బృందాలను రంగంలో దించి దర్యాప్తు చేపడుతున్నప్పటికీ కనీసం సమాచారం లభ్యం కాలేదు.

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఆయా శాఖల జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ కమిటీ సభ్యులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి స్థానిక అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఎస్ఈబీ అధికారులు జిల్లాలో తాము మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. పోలీసులతో కలిసి ఎస్ఈబీ పోలీసులు ఇప్పటివరకు 73 కేసులు పెట్టి 209 మందిని అరెస్టు చేసి మొత్తం 693 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నామని, గంజాయి మొక్కలను పెంచుతున్న వారిపై మూడు కేసులు నమోదుచేసి 36 గంజాయి మొక్కలను ధ్వంసం చేశామన్నారు. పట్టుబడిన వారిలో మొత్తం 31 మంది ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన వారన్నారు. ఐదుగురు ఇంకనూ జైలుశిక్ష అనుభవిస్తున్నారని, ఇటీవల కాలంలో ఒడిశా నుంచి కూలి పనిపై వచ్చి చిలకలూరిపేట సమీపంలోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు భార్యాభర్తలు వారి మైనర్ కుమారుడు గంజాయి కలిగి ఉండగా అరెస్టు చేసి వారిని కూడా జైలుకు పంపించామన్నారు. జిల్లాలోని అన్ని టెక్నికల్ కాలేజీలైన పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ తోపాటు డిగ్రీ కాలేజీలలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాల గురించి తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నాటుసారా, అక్రమ మద్యం వ్యాపారానికి పాల్పడిన నిందితులపై పోలీసు, ఎస్ఈబీ అధికారులు కలిసి 17 మంది నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసి రాజమండ్రి జైలుకు తరలించామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్‌లో డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులకు ఆరోగ్యపరమైన చికిత్స అందిస్తూ కౌన్సెలింగ్ ద్వారా సూచనలు ఇస్తూ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. గంజాయి, కొకైన్, పొగాకు, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాల అలవాటు నిర్మూలించడం, ఇంటర్నెట్, గేమింగ్ అడిక్షన్, మొబైల్ ఫోన్‌ని ఎక్కువ వాడటం, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర చెడువ్యసనాలు మాన్పించడం వంటి కార్యక్రమాలను జిల్లా అధికారులు కలిసి సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డీఆర్వో కె.వినాయకం, పల్నాడు జిల్లా ఎస్ఈబీ ఈఎస్ వి.చంద్రశేఖరరెడ్డి, జేకే చంద్రశేఖర్, షేక్ షానవాజ్, ఎస్పీ సెల్ డీసీపీ ఎస్.సతీష్‌కుమార్, కే హనుమనాయక్, షేక్ ఉమర్‌వలి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సతీష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, డీఈవో కె.శామ్యూల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి అరుణ పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం తరలింపు అవాస్తవం

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ గుంటూరు టౌన్-2 డివిజన్ కార్యాలయం చిలకలూరిపేటకు తరలిస్తున్నట్లు వచ్చిన వార్త అవాస్తవమని, సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీర్ డాక్టర్ పి.విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్-2 డివిజన్ టిడ్కో భవనంలో ఏర్పాటు చేయలేదన్నారు. ముందస్తు ప్రణాళికతో టిడ్కో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కేవలం డివిజన్ కార్యాలయం కోసం నిర్మించిన సొంతభవనంలోకి తరలించడం జరిగినట్లు వెల్లడించారు. గత కొన్ని నెలలుగా ముందస్తు ప్రణాళికతో డివిజన్ కార్యాలయం మార్పు జరిగిందని చెప్పారు. డివిజన్ పరిధిలో ఉన్న 1.80 లక్షలలో టెన్షన్ సర్వీసులకు, 360 హైటెన్షన్ సర్వీసుల్లో చిలకలూరిపేట సబ్‌డివిజన్ పరిధిలోనే 1.02 లక్షల లోటెన్షన్ సర్వీసులు, 229 హైటెన్షన్ సర్వీసులు వినియోగదారులకు అందుబాటు లో ఉండాలనే ఉద్దేశంతో డివిజన్ కార్యాలయం మార్పు చేయడం జరిగిందని వివరించారు. డివిజన్ పరిధిలోని రూరల్ సబ్ డివిజన్ నాలుగు మండలాల వారికి రవాణా సౌకర్యం సులభతరంగానే ఉందని చెప్పారు.వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగదని తెలిపారు. నూతన భవనంలో అన్ని సౌకర్యాలు ఉన్నందువల్ల ఉద్యోగులకు ఎటువంటి అసౌకర్యం లేదని, ముఖ్యంగా మహిళ ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరితగతిన నిర్మిస్తున్న బైపాస్ రహదారి వలన రవాణా సౌకర్యం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు.